

# మాటా మంతీ

-సాయి పద్మ



\- 3 -

## ప్రోటకోల్ అనబడే సమూహ మర్యాదలు

విషయాలు బాధించటానికీ ఉంటాయి.. ఇన్స్పైర్ చేయటానికీ ఉంటాయి. ఎలా తీసుకుంటాం అనేదాన్ని బట్టి చాలా ఉంటుంది. కొత్తగా ఒక ఆక్సిడెంట్ లో తన రెండు కాళ్ళూ పోగొట్టుకున్న ఒక మిత్రుడు, ప్రోస్తటిక్ లెగ్స్ వేయించుకొని, తను పూర్వం వాడే , బులెట్ ని వదలి..స్కూటర్ మీద భార్యతో వెళ్తున్నప్పుడు జరిగిన సంఘటన అంట ఇది ..అయన చెప్తూ ఇలా అన్నారు ... "నాకే స్కూటర్ మీద వెళ్తున్నందుకు కొంచం బాధగా ఉంది, ఇక నా ఆర్టిఫిషియల్ లెగ్ తో, నా పాత బులెట్ మీద వెళ్ళటం కుదరదు కదా" అని .. అంతలో, అతన్ని ఓవర్ టేక్ చేసి ,ఆయన పరిచయస్తుడొకడు .. " నీకు ఇంక స్కూటర్ తప్పదులే !" అన్నాడట .. ఆ హేళన ఆయన్ని ఆలోచింపచేసింది. కష్టపడి , కొన్నాళ్ళు తన బుల్లెట్ ని పూర్తిగా స్టడీ చేసి, తెలిసిన మెకానిక్ తో మాట్లాడి డిజైన్ ని మార్పించి, తను కూడా తన కృత్రిమ కాలుతో కిక్ కొట్టేలా చేసుకున్నారు.

ఇంచుమించు ఏభై ఐదేళ్ళు ఉంటాయి ఆయనకీ. గత ఇరవైయ్యేళ్ళు గా, అతను, అతని బులెట్ ప్రయాణాలు ప్రజలకి సుపరిచితం. చెప్పాలంటే ఇది చాలా చిన్న హేళన. కానీ, దాన్ని పాజిటివ్ గా ఆయన మలచుకున్న తీరు మాత్రం అద్భుతం.

చాలా చిన్న విషయాలు మనుషుల్ని మార్చేస్తాయి. నాకు తెలిసిన ఎన్ జీ వో లలో ఒకమ్మాయి ఉంది. తల్లి రికార్డింగ్ డాన్సర్ , తండ్రి ఎవరో తెలీదు. తాను డాక్టర్ అవుదామని ఎంతో కష్టపడి చదువుతోంది. "డాక్టర్ అంటే, టైం పడుతుంది కదమ్మా, ఇంకేదైనా కెరీర్ చూజ్ చేసుకోలేకపోయావా?" అంటే , " లేదు మేడం .. మా అమ్మలాంటి , ఇంకా చాలా మంది ఎన్నో బాధలు పడతారు. వాళ్ళని , హాస్పిటల్లలో సరిగ్గా చూడరు. ఒకసారి, డేన్స్ చేస్తూ స్టేజ్ విరిగిపోయి మా అమ్మ కాలు ఫ్రాక్చర్ అయితే, రెండు రోజులు బాత్రూం ముందు దుప్పటి వేసుకొని పడుకున్నాం మేడం.. బెడ్ ఇవ్వటానికి కూడా వెనుకాడారు ..!!, నేను డాక్టర్నైతే , మా అమ్మలాంటి వాళ్ళందరినీ జాగ్రత్తగా చూసుకుంటాను మేడం ..!" ఎంతో ఇన్స్పైరింగ్ గా అనిపించింది. ఆమె, తన తల్లిని చూసుకోగలదో లేదో, డాక్టర్ అవగాలదో లేదో అన్నది వేరే విషయం. కానీ తన గోల్ నిజంగా గొప్పగా అనిపించింది. ముఖ్యంగా ఒక చిన్న సంఘటన ని గుర్తు పెట్టుకొని , దాని సొల్యూషన్ దిశగా ఆలోచించటం.

అదేవిధంగా, విషయాలు, మనుషుల insensitivity చాలా ఇబ్బంది పెడుతుంది కూడా. తెలీని ఇగో మనుషుల్ని రూల్ చేస్తుంది అనుకుంటూ ఉంటాను. చేయగలిగిన విషయాల్లో, కూడా అడ్డుపడుతున్న అహం అందర్నీ ఇబ్బంది పెడుతుంది

ప్రోటకోల్ అనబడే సమూహ మర్యాదలు, వికలాంగులని, వృద్ధులని, ఆడవాళ్ళని బాధించినంతగా ఎవర్నీ బాధపెట్టదేమో అని కూడా నాకు అన్పిస్తుంది. ఉదాహరణకి, కాలు విరిగిపోయి, మోకాలు ఫ్యూజ్ చేయబడిన ఒక ఫ్రెండ్ , ఏ ఫంక్షన్ కి వెళ్ళినా, గుడికి వెళ్ళినా చాలా ఇబ్బంది పడుతుంది. ఎందుకంటె, ఆమె కాలు మడుచుకోలేదు. చూసేవాళ్ళకి అది సంప్రదాయం అనబడే ప్రోటోకోల్ కి విరుద్ధంగా , ఆక్షేపణ గా ఉంటుంది. బాడీ లాంగ్వేజ్ ముఖ్యమే కానీ కంఫర్ట్ లెవెల్ ఇంకా ముఖ్యం.

ఇలాంటి ప్రోటోకోల్ ఇబ్బందులు నేను చాలా ఫేస్ చేస్తాను. సమావేశాల్లో, నేను వెళ్లి ఆహ్వానించలేను. రెండు అడుగులు మాత్రమే ఉన్న స్టేజ్ ప్రోటోకోల్ అధిరోహించలేను. ముఖ్యంగా, లేచి నిల్చొని ..” మళ్ళీ కలుద్దాం , వెళ్లి రండి” అని చెప్పలేను. ఇలాంటి టైమ్స్ లో ఒకసారి ఒక ఆర్టికల్ చదివాను. అమెరికా ప్రెసిడెంట్ గా ఉండగా , పోలియో బారిన పడి వీల్ చైర్ లోంచే పరిపాలన చేసిన రూజ్వెల్ట్ ఇలా అంటారు .. “వచ్చిన వాళ్ళు, అలా మాట్లాడుతుంటే , మీటింగ్ ఎలా ఎండ్ చేయాలో తెలీక, తికమక పడేవాడ్ని.. అప్పుడు ఒక షేక్ హ్యాండ్ తో .. ఇంకా మీటింగ్ అయిపోయింది ..మీరు వెళ్ళవచ్చు అని వోరల్ గా చెప్పటం నేర్చుకున్నాను “ అని ..!

నాకు ఇది ఒక లెసన్. వెళ్ళిన చోట, బాత్రూం అడగలేక, ఇబ్బంది పడిన సంఘటనలు . ప్రోటోకోల్ పేరుతో , తప్పనిసరిగా వీల్చైర్ వదిలి, సభల్లో, వేరే కుర్చీల్లో మారిన సంఘటనలు, వీల్ చైర్ గానీ.. వాళ్ళు వాడిన అసిస్టివ్ పరికరాలు ఇవతలి వాళ్లకి, ఇబ్బంది ,ఎంబరాస్మెంట్ కలిగిస్తున్నాయని చెప్పించుకొని బాధ పడిన స్నేహితుల జీవితాలు కళ్ళ ముందు తిరిగాయి.

ఏది సంప్రదాయం ? ఏది ప్రోటోకాల్ ప్రకారం కరెక్ట్ ? ఎవరు నార్మల్ ? ఇవి ఎవరైనా ఎపుడైనా నిర్వచించగలమా ? జనగణమన పాడుతున్నప్పుడు , నిలబడలేకపోవటం ప్రోటోకోల్ ని ఉల్లంఘించటమా .. లేకపోతే ఆ టైం లో మొబైల్ చెక్ చేసుకోవటం సాంప్రదాయమా ?

పెళ్లి ఫోటోలలో అందంగా కనబడాలని, ఏదన్నా శారీరక ఇబ్బంది ఉండేవాళ్ళు వాడే , కర్రలు , వీల్చైర్ దాచటం ..ప్రోటోకోల్ .. ఎందుకంటె పెళ్లి ఒకేసారి వస్తుంది. అదే సమయంలో, బట్టతల ని విగ్ తో కవర్ చేయటం కాస్మెటిక్.

విచిత్రంగా ఉండదూ.. ఎవరు ఏ పని చేయలేరో .. అదే పని వాళ్ళ చేత చేయించాలి అనుకోవటం. ముఖ్యంగా, ఆలయాల్లో , ప్రోటోకోల్ పేరుతో, కాళ్ళకి కేలిపర్స్ (బ్రేసెస్ ) తో నన్ను అనుమతించక పోతే , తిరుమల లో, అన్నవరం లో నన్ను ఎత్తుకొని (మోసుకొని ) వెళ్ళిన మా తమ్ముడు గుర్తొచ్చాడు. “ఇండియాలో , డిజేబుల్డ్ దేవుళ్ళు లేకపోవటం ఈ ప్రోటోకోల్ కి కారణం అంటావా?” అని అడిగిన వొక స్నేహితుడు కళ్ళలో మెదిలాడు !

ఇది ఒక కొత్త మిధ్యా ప్రపంచం .. కానీ, దీనిలో ప్రోటోకోల్ మనమే నిర్ణయించుకోవాలి. మన సాధ్యాసాధ్యాల ఆధారంగా.. మన శారీరక మానసిక అశక్తతలు, బలాలూ ఆధారంగా..! బలవంతులకి సాయం అవసరం లేదు, బలహీనులకి సాయం అందజేయకపోతే, సమాజం మనుగడ లేదు

ఈ జీవితంలో క్లిష్టమైన ప్రోటోకోల్ పాటిస్తూ పోతే, సమాజం గీతల్లో మాత్రమే నడుస్తూ పోతే .. నీదైన normalcy కోల్పోయేది నువ్వే మిత్రమా ..!

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments